RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక : 309 సంపాదకులు: కలిచేటి వెంకయ్య సోమవారం 5 అక్టోబరు 2026 పేజీలు: 8 వెల: 2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

## రూ.2.80 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



వివరాలు 3లో

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170

# 9 లక్షల ఇళ్లతో పేదలకు పట్టాభిషేకం





- 2029 నాటికి రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్లు
- 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి బుర్రిపాలెం నుంచి శ్రీకారం
- మరో 6 లక్షల ఇళ్ల మంజూరుకు కేంద్రమంత్రి హామీ
- 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో పైలట్ ప్రాజెక్టుగా 177 ఇళ్ల నిర్మాణం
- కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి ఇళ్ల నిర్మాణానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న ముఖ్యమంత్రి సంకల్పం గొప్పదని చౌహాన్ వ్యాఖ్య

**తెనాలి, అక్టోబరు 04 (సింధూర దర్శిని):** 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదలందరికీ వంద శాతం పక్కా ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పేదలకు సొంతిల్లు ఉంటే వారి జీవన ప్రమాణాలతో పాటు ఆత్మగౌరవం పెరుగుతుందని అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో

మిగతా 2లో...

## చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలుస్తుంది

- పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం
- 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి తొలి విడత నిధులు -- అవసరమైతే మరో 3 లక్షల ఇళ్లు మంజూరు చేస్తాం
- 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో వేగంగా, తక్కువ ఖర్చుతో ఇళ్ల నిర్మాణం

**తెనాలి, అక్టోబరు 04 (సింధూర దర్శిని):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలుస్తుందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. తెనాలి రూరల్ బుర్రిపాలెం గ్రామంలో గృహ నిర్మాణ రంగంలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణ పైలెట్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి తో కలసి శ్రీకారం చుట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ

మిగతా 2లో...



## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు: కవిత



- కృష్ణ, కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్
- రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు

**హైదరాబాద్ ( సింధూర దర్శిని) 4 అక్టోబరు :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన

మిగతా 2లో...

# ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి.. ఒకరి మృతి

**ఉక్రెయిన్:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న వేళ, ఉక్రెయిన్‌లోని భారతీయ ఫార్మా కంపెనీపై భీకర దాడి జరిగింది. రష్యా ప్రయోగించిన డ్రోన్లు సుమీ నగరంలోని 'కుసుమ్ గ్రూప్'కు చెందిన ఫార్మా ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు తెలిపారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ దాడిలో ప్లాంట్‌లోని ప్రధాన నిర్మాణం దాదాపు పూర్తిగా ధ్వంసమైంది. డ్రోన్లు దాడి చేసిన ప్రాంతం నుంచి భారీగా పొగ కమ్ముకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ దాడి వల్ల సుమారు రూ.400 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. విశేషమేమిటంటే.. రెండేళ్లకు పైగా యుద్ధం జరుగుతున్నప్పటికీ, ఈ ప్లాంట్ నిరంతరాయంగా ఉత్పత్తిని కొనసాగిస్తూనే ఉంది. తాజా దాడితో కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి.భారతీయుడైన రాజీవ్ గుప్తా నేతృత్వంలో కుసుమ్ గ్రూప్ నడుస్తోంది. ఈ సంస్థ 1994లో భారతీయ ఔషధాలను ఉక్రెయిన్‌కు ఎగుమతి చేసే డిస్ట్రిబ్యూటర్‌గా ప్రారంభమై,

మిగతా 2లో...

- ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా డ్రోన్ల దాడి
- సుమీ నగరంలోని కుసుమ్ గ్రూప్ ప్లాంట్ దాదాపు ధ్వంసం
- దాడిలో ఒకరు మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- దాదాపు రూ.400 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా





## అమెరికాలో రోడ్డు ప్రమాదంలో తెలంగాణ మహిళ దుర్మరణం

- మృతురాలిని మహబూబాబాద్ జిల్లాకు చెందిన దారం సుప్రియగా గుర్తింపు
- ఆమె ప్రయాణిస్తున్న కారును ట్రక్కు ఢీకొట్టడంతో మృతి
- ఈ ఘటనలో మరో భారతీయ యువతికి తీవ్ర గాయాలు

**అమెరికా:** అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన మహిళ మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి

మిగతా 2లో...

# ఇళ్ల కొరత, అద్దెల భారం.. స్పెయిన్‌ను కుదిపేస్తున్న గృహ సంక్షోభం!

- స్పెయిన్‌లో తీవ్రమైన గృహ సంక్షోభంపై భారీ నిరసనలు
- రాజధాని మాడ్రిడ్‌తో పాటు 50 నగరాల్లో వేలాది మంది ఆందోళనలు
- ప్రభుత్వం ప్రతిపాదించిన గృహ సంక్షోభ నివారణ చర్యలు విఫలం
- అద్దెలు తగ్గించాలని, ఇళ్లు ఖాళీ చేయించకుండా రక్షణ కల్పించాలని డిమాండ్
- దేశంలో ముందస్తు ఎన్నికలు రావొచ్చనే ఊహాగానాలకు దారితీసిన పరిణామాలు

**స్పెయిన్:** స్పెయిన్‌లో గృహ సంక్షోభం తీవ్ర రూపం దాల్చింది. ఇళ్ల కొరత, విపరీతంగా పెరిగిన అద్దెలు, బలవంతపు ఖాళీలపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. రాజధాని మాడ్రిడ్‌తో పాటు దేశంలోని 50 నగరాల్లో శనివారం పదివేల సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చి భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రభుత్వం ప్రతిపాదించిన అత్యవసర గృహనిర్మాణ చర్యలను పార్లమెంట్

మిగతా 2లో...



## ఇండియా కూటమిలోకి విజయ్ టీవీకే.. చారిత్రక దినమన్న కాంగ్రెస్



- బీజేపీ వ్యతిరేక కూటమి మరింత బలపడిందన్న మాణికం టాగోర్
- ఎన్నికల కమిషన్ చీఫ్‌కు వ్యతిరేకంగా నిరసనలకు కూటమి నిర్ణయం
- అక్టోబర్ 13 నుంచి 15 వరకు ఆందోళనలకు పిలుపు

**చెన్నై:** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ ప్రతిపక్షాల ఇండియా కూటమిలో చేరింది. ఈ విషయాన్ని తమిళనాడు

మిగతా 2లో...



## నేడు కడప జిల్లాలో చంద్రబాబు, పవన్ పర్యటన

- 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్) పథకానికి శ్రీకారం
- రూ.30,156 కోట్ల వ్యయంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా
- రాష్ట్రవ్యాప్తంగా 27.36 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యం
- ప్రొద్దుటూరులో పథకం ప్రారంభించి, బహిరంగ సభలో ప్రసంగించనున్న నేతలు

**అమరావతి ( సింధూర దర్శిని) 4 అక్టోబరు :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న 'అమరజీవి జల ధార' (జల్ జీవన్ మిషన్) పథకానికి సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని

మిగతా 2లో...

## ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి.. ఒకరి మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఆ తర్వాత సొంత బ్రాండ్లను మార్కెటింగ్ చేసింది. 2009లో సుమీ నగరంలో తయారీ ప్లాంట్‌ను స్థాపించింది. ఈ గ్రూప్ ఉక్రెయిన్, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్ వంటి 9కి పైగా దేశాలకు 50 రకాల జనరిక్ ఔషధాలను విక్రయిస్తోంది.గత కొంతకాలంగా రష్యా.. చవకైన, వేగవంతమైన షాహెద్ డ్రోన్లతో ఉక్రెయిన్‌పై నిరంతరం దాడులు చేస్తోంది. ఈ డ్రోన్లను అడ్డుకోవడం ఉక్రెయిన్ వాయు రక్షణ వ్యవస్థలకు సవాలుగా మారింది. ఇదే సమయంలో, ఉక్రెయిన్ కూడా దేశీయంగా తయారుచేసిన 'ఎఫ్‌పీ-7' బాలిస్టిక్ క్షిపణిని ఈ వారంలో తొలిసారిగా ప్రయోగించినట్లు ప్రకటించింది. దీని పరిధి సుమారు 250 కిలోమీటర్లు కావడం గమనార్హం.

## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు: కవిత

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు.ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు."నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా ఆ నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు.రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటలు కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

## ఇళ్ల కొరత, అద్దెల భారం.. స్పెయిన్‌ను కుదిపేస్తున్న గృహ సంక్షోభం!

(మొదటిపేజీ తరువాయి)

తిరస్కరించిన మరుసటి రోజే ఈ ఆందోళనలు జరగడం గమనార్హం.మాడ్రిడ్‌లో జరిగిన ప్రదర్శనలో సుమారు 70,000 మంది పాల్గొన్నారని అధికారులు అంచనా వేయగా, ఈ సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. అద్దెలు తగ్గించాలని, ఇళ్లు ఖాళీ చేయించకుండా బలమైన చట్టపరమైన రక్షణ కల్పించాలని, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌లు నివాస గృహాలను కొనుగోలు చేయడంపై ఆంక్షలు విధించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. కొందరు దేశవ్యాప్త సమ్మెకు కూడా పిలుపునిచ్చారు.గత నెలలో జరిగిన ఒక సంఘటన ఈ ఆందోళనలకు మరింత ఆజ్యం పోసింది. దశాబ్దాలుగా ఒకే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న 87 ఏళ్ల మారికార్మెన్ అబాస్కల్‌ను ఇంటి నుంచి బలవంతంగా ఖాళీ చేయించారు. ఆ భవనాన్ని కొనుగోలు చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ అద్దెను భారీగా పెంచడంతో ఆమె వెళ్లిపోవాల్సి వచ్చింది. ఈ ఉదంతం దేశవ్యాప్తంగా ప్రజల ఆగ్రహానికి ప్రతీకగా నిలిచింది.ప్రస్తుతం స్పెయిన్‌లో దాదాపు 7 లక్షల ఇళ్ల కొరత ఉన్నట్లు అంచనా. 2025లో సగటున అద్దెలు 8.5% పెరగ్గా, మాడ్రిడ్, బార్సిలోనా వంటి నగరాల్లో ఈ పెరుగుదల ఇంకా ఎక్కువగా ఉంది. దీంతోపాటు ఇళ్ల ధరలు కూడా ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో ప్రధాని పెడ్రో సాంచెజ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం రెండు కీలక డిక్రీలను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. బలహీన వర్గాల వారిని 2030 వరకు ఇళ్ల నుంచి ఖాళీ చేయించకుండా నిలిపివేయడం, కొన్ని అద్దె ఒప్పందాలను పొడిగించడం వంటి చర్యలు ఇందులో ఉన్నాయి. అయితే, ప్రతిపక్షాలైన పాపులర్ పార్టీ, వోక్స్, జంట్స్ పార్టీలు వ్యతిరేకించడంతో ఈ ప్రతిపాదనలు వీగిపోయాయి. ఈ రాజకీయ పరిణామాలతో స్పెయిన్‌లో ముందస్తు ఎన్నికలు రావొచ్చనే ఊహాగానాలు బలపడ్డాయి.

## అమెరికాలో రోడ్డు ప్రమాదంలో తెలంగాణ మహిళ దుర్మరణం

(మొదటిపేజీ తరువాయి)

చెందిన దారం సుప్రియ (31) ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆమె కుటుంబంలో, మహబూబాబాద్ పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.వివరాల్లోకి వెళితే.. ఉద్యోగరీత్యా అమెరికాలోని మిస్సోరిలో నివసిస్తున్న సుప్రియ, ఇవాళ తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం) కారులో ప్రయాణిస్తున్నారు. ఈ సమయంలో వారు ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన ఒక ట్రక్కు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు సుప్రియ అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెతో పాటు కారులో ఉన్న మరో భారతీయ యువతికి తీవ్ర గాయాలయ్యాయి.సుప్రియ భర్త కొడుమూరి రంజిత్, అత్తమామలు కొడుమూరి వెంకటేశ్వర్లు, రాధిక మహబూబాబాద్ పట్టణంలోని వీరభద్ర అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, మృతదేహాన్ని స్వదేశానికి తరలించే ఏర్పాట్లపై ఇంకా స్పష్టత రాలేదు.

# 9 లక్షల ఇళ్లతో పేదలకు పట్టాభిషేకం

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కలిసి రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారు కుటుంబంతో కలిసి ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. రాష్ట్రానికి సాధారణ కోటా కింద 75 వేల ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయని, ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడంతో కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని చంద్రబాబు తెలిపారు. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోగానే మరో 3 లక్షల ఇళ్లను, వచ్చే ఏడాది మరో 3 లక్షల ఇళ్లను మంజూరు చేసేందుకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అంగీకరించారని చెప్పారు. మొత్తంగా 9 లక్షల ఇళ్లను రాష్ట్రానికి మంజూరు చేసేందుకు కేంద్రం సహకరిస్తోందని తెలిపారు. పేదలకు సొంత ఇల్లు ఇవ్వాలన్న ఆలోచనకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని సీఎం గుర్తు చేశారు. 3 లక్షల ఇళ్ల నిర్మాణం అంటే కేవలం ఇళ్లు నిర్మించడమే కాదని, 3 లక్షల కుటుంబాల జీవితాల్లో మార్పునకు శ్రీకారం చుట్టే కార్యక్రమమని అన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు వేసిన ఓటుతో సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ చేర్చేలా సుపరిపాలన అందిస్తున్నామని చెప్పారు. గృహ నిర్మాణ రంగంలో ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు బుర్రిపాలెంలో రూ.14 కోట్లతో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ద్వారా 177 ఇళ్ల నిర్మాణానికి చేపట్టిన పైలట్ ప్రాజెక్టును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి సీఎం సందర్శించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు గురించి అధికారులు వివరించారు. 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో పటిష్టమైన ఇళ్లను నిర్మించవచ్చని అధికారులు వివరించారు. ఈ సాంకేతికతతో నిర్మించే ఇళ్లలో బయట వాతావరణంతో పోలిస్తే ఉష్ణోగ్రత తక్కువగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించినట్టు సీఎం అన్నారు.



### పేదలకు రూ.52 వేల కోట్ల విలువైన స్థలాలు

పేదలకు పట్టాభిషేకంలో భాగంగా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి పేదలకు నివాస స్థలాలు అందించామని చంద్రబాబు తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, మంగళగిరి సహా వివిధ ప్రాంతాల్లో రూ.52 వేల కోట్ల విలువైన స్థలాలను పేదలకు అందించామని చెప్పారు. ప్రతి వర్గానికి, ప్రతి ప్రాంతానికి అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ అజెండా అని స్పష్టం చేశారు. గత పాలనలో గృహ నిర్మాణ కార్యక్రమం పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని సీఎం విమర్శించారు. 2019--24 మధ్య 6 లక్షల పేదల ఇళ్లను రద్దు చేశారని, నివాసయోగ్యం కాని చెరువులు, గుట్టల్లో ఇంటి స్థలాలు ఇచ్చారని ఆరోపించారు. దాదాపు 4 లక్షల మంది ఆ స్థలాలను వద్దంటూ వెనక్కి ఇచ్చేశారని తెలిపారు. ఇప్పుడు మళ్లీ పేదలకు పక్కా ఇళ్లను నిర్మించి ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేసి పోలవరం పూర్తయ్యేలోగా గోదావరి నీటిని వినియోగించుకున్నామని సీఎం చెప్పారు. ఎల్‌నినో వంటి తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లోనూ కృష్ణా డెల్టాకు గోదావరి నీటిని తరలించి పంటలను కాపాడగలిగామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు నీటి సమస్య లేకుండా చేస్తామని అన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అంకురార్పణ చేశామని, రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఉద్యాన ఫలాల ఉత్పత్తి కేంద్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు.

### షైనింగ్ ఆంధ్రా- అచీవింగ్ ఆంధ్రా : శివరాజ్ సింగ్ చౌహాన్

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. విజనరీ నేత చంద్రబాబు నేతృత్వంలో ఏపీ ఇక షైనింగ్ ఆంధ్రా, అడ్వాన్స్ ఆంధ్రా, అచీవింగ్ ఆంధ్రాగా మారుతోందని కొనియాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న చంద్రబాబు సంకల్ప బలం గొప్పదని ప్రశంసించారు. 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ సాంకేతికతతో ఏపీలో చేపడుతున్న గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చేపట్టిన 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోగానే మరో 3 లక్షల ఇళ్లకు శాంక్షన్ ఇస్తామని, ఆ తర్వాత మరో 3 లక్షల ఇళ్లను కూడా ఏపీకి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. రైతుల కోసం కేంద్రంతో కలిసి ఏపీ సీఎం అన్నదాత సుఖీభవ కింద రూ.20వేల ఆర్థిక సహకారం అందిస్తున్నారని అన్నారు. ఏపీలోని అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు మొత్తం సుఖీభవ అనే విధానంలో ఏపీలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యాఖ్యానించారు. వీబీజీ రామ్ జీ పథకంతో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో డ్రెయిన్లు, రోడ్లు సహా వివిధ మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం సహకారం అందిస్తుందన్నారు. ఏపీని 360 డిగ్రీల కోణంలో సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారన్నారు.

### త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ పరిశీలన

అంతకుముందు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా చేపట్టిన గృహ నిర్మాణ ప్రాజెక్టును సందర్శించారు. సీబీఆర్ఐ అధికారులు వారికి త్రీడీ టెక్నాలజీ నిర్మాణ ప్రక్రియ గురించి వివరించారు. కేవలం 10 రోజుల్లో ఒక ఇంటిని ఈ సాంకేతికతతో నిర్మించే అవకాశముందని తెలిపారు. అనంతరం ఇరువురు నేతలు ఓ లబ్ధిదారు కుటుంబంతో కలిసి చెందిన ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భూమి పూజ చేసిన అనంతరం లబ్ధిదారు కుటుంబంతో ఆప్యాయంగా మాట్లాడి వారికి నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి సూచికగా శిలాఫలకం ఆవిష్కరించి అక్కడికి సమీపంలోనే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం వేదికపై లక్ష్మీ అనే మహిళకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇంటి పట్టాఅందించారు.

## చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలుస్తుంది

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, సమర్థవంతమైన నాయకత్వం, అభివృద్ధి పట్ల నిబద్ధతను ప్రశంసించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డైనమిక్, నిర్ణయాత్మక నాయకత్వానికి ప్రతీక అని కేంద్ర మంత్రి కొనియాడారు. భవిష్యత్ భారతదేశానికి సాంకేతికతే ప్రధాన బలమని ముందుగానే గుర్తించి ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబు నాయుడిదేనన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్లు, క్వాంటం టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఆధునాతన తయారీ రంగాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమవుతోందన్నారు. అమరావతి అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపుతున్న దూరదృష్టి తనను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. ఆయన విజన్, కృషి, నిబద్ధతను చూస్తుంటే చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా అవతరిస్తుందన్న నమ్మకం కలుగుతోందన్నారు.

### పెమ్మసాని చంద్రశేఖర్ సేవలు అభినందనీయం

బుర్రిపాలెం డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్వగ్రామం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి తెలిపారు. అమెరికా నుంచి తిరిగి వచ్చిన వ్యక్తిగా గ్రామీణాభివృద్ధి, ప్రజా సమస్యలను ఎంతవరకు అర్థం చేసుకుంటారోనని మొదట అనుకున్నానని, అయితే ఆయనలోని స్పష్టత, నిబద్ధత, ప్రజలతో అనుబంధం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్నారు. ఇలాంటి ప్రతిభావంతులను రాజకీయాల్లోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని అభినందించారు. ప్రజలకు సేవ చేయడం భగవంతుడిని పూజించడంతో సమానమని, తాము ప్రజా సేవకులుగా మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

### పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తాం

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు కల్పించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలను సాకారం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులను సక్రమంగా వినియోగించి ఉంటే రాష్ట్రంలోని పేదల ఇళ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యేదన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తొలుత 76 వేల ఇళ్లకు మాత్రమే అనుమతించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని పేదలందరికీ ఇళ్లు నిర్మించాలనే ఆశయానికి అనుగుణంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ పేదల కోసం 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి మంజూరు చేశామన్నారు. అలాగే ప్రస్తుతం 3 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసిన అనంతరం మరో 3 లక్షల ఇళ్లు, అవసరాన్ని బట్టి తదుపరి విడతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పేదలందరికీ ఇళ్లు నిర్మించే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

### 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణం

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించనున్న ఇళ్లలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి తెలిపారు. ముఖ్యంగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా ఇళ్లను నిర్మించే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ సాంకేతికత ద్వారా ఇళ్ల నిర్మాణ సమయం తగ్గడంతో పాటు నిర్మాణ వ్యయం తగ్గుతుందని, తక్కువ మానవ వనరులతో నిర్మాణం చేపట్టవచ్చని తెలిపారు. నిర్మాణాల నాణ్యత, మన్నిక కూడా మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆరు నెలల వ్యవధిలో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే లక్ష్యంతో ఈ సాంకేతికతను వినియోగించేందుకు ప్రయత్నిస్తున్నామని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## ఇండియా కూటమిలోకి విజయ్ టీవీకే.. చారిత్రక దినమన్న కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు బి.మాణికం టాగోర్ అధికారికంగా ప్రకటించారు.చెన్నైలోని టీఎన్‌సీసీ కార్యాలయంలో జరిగిన బహుళ పార్టీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి టీవీకే తరఫున మంత్రులు ఆధవ్ అర్జున, ఎన్.మేరీ విల్సన్ హాజరయ్యారు. టీవీకే చేరికను 'చారిత్రక దినం'గా అభివర్ణించిన మాణికం టాగోర్, ఈ పరిణామంతో తమిళనాడులో బీజేపీ వ్యతిరేక కూటమి మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ భేటీలో కాంగ్రెస్, టీవీకేతో పాటు సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల కమిషన్ చీఫ్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టాలని కూటమి నిర్ణయించింది. ఇందులో భాగంగా అక్టోబర్ 13, 14 తేదీల్లో జిల్లా స్థాయి ప్రదర్శనలు, అక్టోబర్ 15న చెన్నైలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు.ఇండియా కూటమిలో తమ పార్టీ అధికారికంగా చేరినట్లు టీవీకే మంత్రి ఆధవ్ అర్జున సైతం ధ్రువీకరించారు. అయితే, దీనిపై పార్టీ అధినేత, ముఖ్యమంత్రి విజయ్ నుంచి నేరుగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

## నేడు కడప జిల్లాలో చంద్రబాబు, పవన్ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రేపు (అక్టోబరు 5) కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో పర్యటించనున్నారు. వీరిద్దరూ కలిసి ఈ భారీ తాగునీటి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి, జాతికి అంకితం చేస్తారు.అధికారిక షెడ్యూల్ ప్రకారం, సోమవారం ఉదయం 11:20 గంటలకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్‌కు సంబంధించిన ప్రత్యేక శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విధానాలు, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై వారు ప్రజలకు వివరించే అవకాశం ఉంది. నేతల పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందుకోసం సుమారు రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 27.36 లక్షల కొత్త గృహ కుళాయి కనెక్షన్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ముఖ్యంగా, తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచివెళ్లే గ్రామీణ మహిళల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ పథకం యొక్క ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వంలో ఇది ఒక కీలకమైన గ్రామీణ సంక్షేమ కార్యక్రమంగా నిలవనుంది.

# రూ.2.80 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



- సచివాలయ భవనాలు, పార్కు ప్రహరీ, గ్రీనరీ
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ
- వచ్చే ఏడాది జూన్ 12 నాటికి భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేస్తాం

నెల్లూరు( సింధూర దర్శిని) 4 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మరో రూ.2.80 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శ్రీకారం చుట్టారు. నగరంలోని 11వ, 10వ, 45వ డివిజన్లలో సచివాలయ భవన నిర్మాణాలు, పార్కు ప్రహరీ గోడ, గ్రీనరీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో రూ.కోటి వ్యయంతో సచివాలయ భవన నిర్మాణానికి, పార్కు స్థలానికి రూ.30 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. రాయపుపాలెం ప్రాథమిక పాఠశాలను పరిశీలించి ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అనంతరం 10వ డివిజన్ ఎన్‌డీఆర్ లేఅవుట్ వద్ద రూ.70 లక్షలతో సచివాలయ భవన నిర్మాణానికి, 45వ డివిజన్ మినీ బైపాస్‌లో రూ.80 లక్షలతో గ్రీనరీ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూ.50 వేల కోట్ల నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు.

### భూగర్భ డ్రైనేజీ పనులకు ప్రాధాన్యత

నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులను వచ్చే ఏడాది జూన్ 12వ తేదీ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం గా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. భూగర్భ డ్రైనేజీ కనెక్షన్ల కోసం ప్రభుత్వం రూ.61 కోట్ల నిధులు మంజూరు చేసిందని వెల్లడించారు. నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య, మౌలిక సదుపాయాలు అందించేలా పనుల ను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

### ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణకు చర్యలు

వచ్చే విద్యా సంవత్సరం నాటికి నెల్లూరు నగరంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను విఆర్‌సీ తరహాలో అభివృద్ధి చేసి, ఆధునిక సదుపాయాలతో సిద్ధం చేస్తామని మంత్రి తెలిపారు. యువనేత నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కార్పొరేషన్ ఎస్ఈ జానీ, అదనపు కమిషనర్ హిమబిందు, నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, డివిజన్ల నాయకులు నాగేంద్ర, బాలకృష్ణ, తిరుమల నాయుడు, పోకల రవి, సుజన్‌తో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన పట్టణ అధ్యక్షులు దయాకర్

గూడూరు( సింధూర దర్శిని) 4 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గూడూరు పట్టణ పరిధిలో బీజేపీని మరింత బలోపేతం చేసి, ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని గూడూరు పట్టణ బిజెపి అధ్యక్షులు కే. దయాకర్ పిలుపునిచ్చారు. ఆదివారంగూడూరు పట్టణంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల చెన్నూరు, నెలటూరు, పొటిపాళెం, పురిటిపాళెం, చిల్లకూరు తదితర గ్రామాలు గూడూరు మున్సిపాలిటీ పరిధిలోకి చేరిన నేపథ్యంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సంస్థాగతంగా సిద్ధం చేయడంపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. కొత్తగా మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చిన ప్రాంతాల్లో పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ఎన్నికల వ్యూహంపై నాయకులు చర్చించారు. అదేవిధంగా ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లి సేవా కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ



సమావేశంలో, జిల్లా కార్యవర్గ సభ్యులు, శ్రీ శ్రీ శివాలయం చైర్మన్ బాలకృష్ణ నాయుడు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, కిసాన్ మోర్చా కోస్తా ఆంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ అభిలాష్ రెడ్డి, సీనియర్ నాయకులు కోటారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ప్రకాష్ నాయుడు, గూడూరు రూరల్ ఇన్‌చార్జ్ బైరప్ప, గూడూరు రూరల్ అధ్యక్షులు నరేంద్ర, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు మధిర సునీల్, మండల ప్రధాన కార్యదర్శి రవీంద్ర, మండల ఉపాధ్యక్షులు సురేష్ బాబు, శ్రీనివాస్ యాదవ్, ఓబీసీ అధ్యక్షులు సురేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బాలమణి, పట్టణ కార్యదర్శి భార్గవ్, పట్టణ కోశాధికారి నిరంజన్, పట్టణ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి భవాని తదితరులు పాల్గొన్నారు.

# చిన్నతనం నుండే విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



## ముఖ్య అతిథిగా డాక్టర్ రోహిణి

గూడూరు (సింధూర దర్శిని) 4 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; చిన్నతనం నుండే విద్య తో పాటు క్రీడల పట్ల కూడా తల్లిదండ్రులు చిన్నారులను ప్రోత్సహించాలని చెస్ ఆడడం వల్ల మేధాశక్తి పెరుగుతుందని గూడూరు ప్రభాస్ ఫ్యాన్స్ ప్రతి సంవత్సరం పలుసేవా కార్యక్రమాల నిర్వహించడం అభినందనీయమని డాక్టర్ రోహిణి వెల్లడించారు. సినీ హీరో ప్రభాస్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ప్రభాస్ యువసేన ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో చెస్ పోటీలు నిర్వహించారు. పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రోహిణి విచ్చేశారు. విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. డాక్టర్ రోహిణి మాట్లాడుతూ చెస్ క్రీడ ఇంట్లోనే కూర్చుని తల్లిదండ్రులు పిల్లలు ఆడుకోవచ్చని పిల్లల్లో చిన్నతనం నుండి మేధాశక్తి పెరుగుతుందని అన్నారు. ప్రభాస్ ఫ్యాన్స్ ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని, విపత్కర పరిస్థితుల్లో రక్తం ఇంకొకరి ప్రాణాలను నిలుపుతుందని తెలిపారు. చిన్నారులను సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని మంచి పద్ధతులను నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రాజు (యోగి) ,భాస్కర నాయుడు ,ముమ్మడి వెంకటేశ్వర్లు, మనోజ్,కోటి,జయచంద్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.



## ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

గూడూరు( సింధూర దర్శిని) 4 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; చిల్లకూరు మండల పరిధిలోని తూర్పు కనుపూరు గ్రామంలో స్వయంభుగా వెలసి నిత్యం పూజలు అందుకుంటున్న ముత్యాలమ్మ అమ్మవారు దేవస్థానం నందు అమ్మవారికి ఆలయ ఈవో కొమ్మలపూడి నవీన్ కుమార్ , చైర్మన్ దశరథరామిరెడ్డి పర్యవేక్షణ లో ఆది వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా నలుమూలల నుండి వచ్చిన భక్తు లు అమ్మవారిని దర్శించుకుని , మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్య లో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం అంతా సందడి వాతావరణం నెలకొంది.





## దేశ రాజకీయాలు - పెరుగుతున్న మత భావనలు: కామ్రేడ్ అనిల్

గూడూరు( సింధూర దర్శిని) 4 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; దేశ రాజకీయాలలో పెరుగుతున్న మత భావనలు అనే అంశంపై కామ్రేడ్..అనిల్ ఉపన్యసించడం జరిగింది. ఆదివారం ఉదయం గూడూరు స్థానిక సి.పి.ఎం పార్టీ కార్యాలయంలో జరిగిన మొదటి రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యదర్శి జోగి.శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కామ్రేడ్. అనిల్ మాట్లాడుతూ దేశ ప్రజలు రోజు వారి జీవన సమస్యల మీద ఐక్యమై పోరాడాలని, దేశ రాజకీయాలను జీవన సమస్యల పరిష్కార దిశగా నడపాల్సిన బాధ్యత దేశ ప్రజల మీద బాధ్యత ఉందన్నారు, ప్రపంచంలో ఏ మత దేశంలో కూడా ఆర్థిక,సామాజిక, సమానత్వం లేదని,భారత దేశంలో కూడా ఆర్థిక,సామాజిక,సమానత్వాన్ని, ఏ మతం పరిష్కరించ లేదని, కేవలం సోషలిజం విధానాల...ద్వారానే సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం,సి.ఐ.టి.యు,కెవిపిఎస్,ఆటో,ప్రజాసంఘాల నాయకులు టి.వెంకట్రామిరెడ్డి, బి.వి.రమణయ్య,పామంజి మణి,గుర్రం రమణయ్య,ఆర్.శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, ఎంబేటి.చంద్రయ్య, బొద్దు.శ్రీనివాసులు, గార.బాబు,బి.ఎస్.ప్రభావతి, ఏ.ఇందిరమ్మ,జె.లక్ష్మీ,ఎం.అరుణ,సుధా,బి.నారాయణ,బి.భాస్కర్ రెడ్డి,ఎం.వెం కట్రావు, కె.డేవిడ్,ఆర్.నారాయణ,ఎం.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ

**రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ**



నెల్లూరు( సింధూర దర్శిని) 4 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన అనంతరం ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.నెల్లూరులో పర్యటించిన సందర్భంగా మున్సి పల్ ఎన్నికల నిర్వహణపై మీడియా అడిగిన ప్రశ్నలకు మంత్రి స్పందిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.16వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.12 వేల కోట్ల నిధులు అందే అవకాశం ఉందని, స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం ద్వారా ఆయా సంస్థల అభివృద్ధికి అవసరమైన నిధుల వినియోగానికి మార్గం సుగమమవుతుందని మంత్రి పేర్కొన్నారు.వార్డుల విభజన, రిజర్వేషన్లకు సంబంధించిన ప్రక్రియ ఎన్నికల సంఘం పరిధిలో ఉంటుందని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం సంబంధిత ప్రక్రియలో పురోగతి ఉంటుందని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వెల్లడించారు.

## ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలి

**గూడూరు డిఎస్పి నరసింహమూర్తి**



గూడూరు (సింధూర దర్శిని) 4 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; సమాజంలో మూడు ప్రధాన సవాళ్లుగా మారుతున్న డ్రగ్స్, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాలు... ఈ మూడింటికీ అడ్డుకట్ట వేసే లక్ష్యంతో నెల్లూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం... ఆపరేషన్ త్రిశూల్.ఈ కార్యక్రమంలో భాగంగా గూడూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు పార్క్ వీధి నందు ప్రత్యేక డ్రైవ్ డి.ఎస్.పి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం... మహిళలు, బాలికల భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను నియంత్రించి రోడ్డు ప్రమాదాలను తగ్గించడం... ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశాలు.డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని, యువతకు సూచిస్తూ... మహిళల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పించారు.ఎందుకంటే... ఒకవైపు యువత భవిష్యత్తు, మరోవైపు మహిళల భద్రత, ఇంకోవైపు ప్రజల ప్రాణాలు ఈ మూడింటి రక్షణే ఈ కార్యక్రమం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం అని తెలిపారు.



## గణేష్ దీక్ష ఇరుముళ్ళ సమర్పణ

### ఆలయ ఈవో పెంచల కిషోర్

కాణిపాకం( సింధూర దర్శిని) 4 అక్టోబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు భాగంగా ఆదివారం తెప్పోత్సవం సందర్భంగా ఉభయదారుల ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదము పంపిణీ చేశారు.వార్షిక బ్రహ్మోత్సవాల చివరి రోజు అధిక సంఖ్యలో గణేష్ దీక్ష



ఇరుముళ్ళు సమర్పణ, స్థానికులు గణేష్ దీక్ష మాలాధారణ భక్తుల ఆధ్వర్యంలో ఇరుములను అధిక సంఖ్యలో ఇరుములను సమర్పించారు, ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ మరియు ఈ.వో పెంచల కిషోర్ పాల్గొన్నారు.సంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా ఆస్థానం మండపం నందు ఉదయం శ్రీ ఉప్పలదడియం భరత్ శర్మ ఆధ్వర్యంలో అష్టావధానం నిర్వహించడం జరిగింది.

## మొగిలీస్వర స్వామి వారి నుండి గణపయ్యకు పట్టు వస్త్రాలు

### ఆలయ ఈవో పెంచల కిషోర్



కాణిపాకం (సింధూర దర్శిని) 4 అక్టోబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం 2026 వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం చివరి రోజు తెప్పోత్సవం సందర్భంగా శ్రీ స్వయంభూ మొగిలీస్వర స్వామి వారి దేవస్థానం మొగిలి బంగారుపాల్యం మండలం నుండి శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించిన మొగిలి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలనాథ్ రెడ్డి, మరియు వంశపార్య ధర్మకర్త విజయ్ కుమార్, అర్చకులు,ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, స్థానిక నాయకులతో కలిసి పట్టువస్త్రాలను సమర్పించడం జరిగింది, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం చైర్మన్ మణి నాయుడు ,ఈ.వో పెంచల కిషోర్ . ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు నాగరాజు నాయుడు, కృష్ణవేణి, సునీత, రాజ్యలక్ష్మి, అనసూయ, చంద్రకళ, శ్రీవాణి, నరేష్, శివప్రసాద్, సతీష్, అర్చకులు, వేద పండితులు, కాణిపాకం దేవస్థానం ఏఈఓ రవీంద్రబాబు, ధనపాల్, సూపర్డెంట్లు వాసు, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ రైతులతో ముఖాముఖి

### కేంద్ర వ్యవసాయం మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీరామ్ నాథ్ ఠాగూర్



శ్రీకాళహస్తి ( సింధూర దర్శిని) 4 అక్టోబర్ తిరుపతి జిల్లా ; కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్ ఆయిల్‌పామ్ రైతులతో ముఖాముఖి కార్యక్రమం "ఆయిల్‌పామ్ రైతులతో ముఖాముఖి -- రైతుల సమస్యలు, సూచనలు మరియు సాగు అనుభవాలపై చర్చ.శ్రీకాళహస్తి మండలం వేదం గ్రామంలో ఆదివారం కేంద్ర సహాయ వ్యవసాయ శాఖ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ ఆయిల్‌పామ్ తోటలను సందర్శించి రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ కమిషనర్ డా. ప్రభాత్ కుమార్, తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు , ఆర్డీఓ భానుప్రకాష్ , ఉద్యానశాఖ అదనపు సంచాలకులు ఎం.కె.వి. శ్రీనివాసులు , డీడీహెచ్ (ఆయిల్‌పామ్) జమదగ్ని ,జిల్లా ఉద్యాన అధికారి జయ భరత్ రెడ్డి, డీఎంఐఓ తిరుపతి, అలాగే కోలా ఆనంద్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, చెంచయ్య నాయుడు , మార్కెట్ కమిటీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయమే ధ్యేయం

### మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి



నెల్లూరు( సింధూర దర్శిని) 4 అక్టోబర్ నెల్లూరు జిల్లా ; మనుబోలు లోని పద్మావతి కల్యాణ మండపంలో, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత తో కలిసి మనుబోలు మండలం లోని అన్ని గ్రామపంచాయతీలకు సంబంధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కీలక సమావేశం నిర్వహించి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అనుసరించవలసిన కార్యాచరణపై మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు "డా" కాకాణి గోవర్ధన్ రెడ్డి చర్చించారు.ఈ సందర్భంగా మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ సిద్ధం అని ,స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ తమ పార్టీ కార్యకర్తలను, నేతలను సమాయత్తం చేస్తోంది. ఇప్పటికే జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 175 నియోజకవర్గాల సమన్వయకర్తలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి తగిన దిశా నిర్దేశం చేశారని కాకాణి తెలిపారు. జగన్ ఆదేశాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు కాకాణి పేర్కొన్నారు, మొదట జిల్లా స్థాయిలో నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించామని, అనంతరం నియోజకవర్గాల వారీగా, ఆ తర్వాత మండల స్థాయి సమావేశాలను పూర్తి చేశామని తెలిపారు, మండల స్థాయి సమావేశాలు ముగిసిన తరువాత, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలతో నేరుగా సమావేశమై క్షేత్రస్థాయిలో వారి సూచనలు, సలహాలు తీసుకుంటూ, ఏదైనా స్థానికంగా సమస్యలు ఉంటే వాటిని ఎలా అధిగమించాలనే దానిపై చర్చలు జరుపుతున్నామని తెలిపారు. ఇప్పటికే నాలుగు మండలాల్లో ఈ కార్యక్రమాలు పూర్తయ్యాయని, చివరిగా మనుబోలు మండలానికి సంబంధించి గ్రామ స్థాయి నేతలు, స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల కార్యాచరణపై చర్చించినట్లు వెల్లడించారు.

### అధికారులకు కఠిన హెచ్చరిక

ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థులకు అనేక అడ్డంకులు సృష్టించాలని అధికారపార్టీ నేతలు యత్నిస్తున్నారని,కుల ధ్రువీకరణ పత్రాలు జారీలో జాప్యం జరిగినా , నామినేషన్లను ఏదోవిధంగా తోసిపుచ్చేందుకు కొంతమంది అధికారులు ద్వారా ప్రయత్నిస్తున్నారని, అటువంటి చర్యలకు పాల్పడవద్దని అధికారులకు ఆయన సూచించారు.పోలీస్, రెవెన్యూ మరియు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు తమ బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, పక్షపాత వైఖరి ప్రదర్శిస్తే చట్టపరంగా ప్రశ్నిస్తామని, ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చట్టబద్ధంగా రావాల్సిన హక్కులు, పారదర్శకమైన సేవలు అందించాల్సిందేనని ఆయన అధికారులను డిమాండ్ చేశారు.చంద్రబాబు హామీలు నెరవేర్చలేదు.. డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు..జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన ప్రకటించిన ప్రతి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేశారని, కానీ చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని కాకాణి విమర్శించారు. చంద్రబాబు పరిపాలన పట్ల ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆవేశం వ్యక్తమవుతున్నాయని అన్నారు.చంద్రబాబు ప్రజల దృష్టిని మళ్లించేందుకు రోజుకో కొత్త పన్నాగాన్ని పన్నుతున్నారని కాకాణి ఆరోపించారు. "ఒకరోజు కొత్తగా పెన్షన్లు ఇస్తానంటారు, మరోరోజు ఎల్ నినో ప్రభావం ఉందంటూ తనకుతానే 'వాటర్ మ్యాన్' అని కొత్త పేరు తగిలించుకుంటారు" అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పాలన అంటేనే కరువుకు నాంది అని, 'చంద్రబాబు, కరువు కవల పిల్లలు అనే పేరు మరుగుపరచు కోవడానికే మదనపల్లెలో ఉద్యానవన హబ్ అని హంగామా, హడావుడి చేశారని మండిపడ్డారు.

### రైతుల పట్ల చిత్తశుద్ధి ఏది?..

రైతుల పట్ల చంద్రబాబుకు నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, నెల్లూరు జిల్లాలో ఉన్న 35 మండలాల్లో ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ఎందుకు ప్రకటించలేదని కాకాణి ప్రశ్నించారు. మదనపల్లెలో ఉద్యానవన పంటలకు సంబంధించి పెద్ద పెద్ద మాటలు చెప్పిన చంద్రబాబు, నెల్లూరు జిల్లా రైతులు పడుతున్న దయనీయమైన పరిస్థితులను పట్టించుకోకుండా కడుపు కొడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### శ్రీశైలం నీటి తరలింపుపై ప్రభుత్వం నిర్లక్ష్యం..

శ్రీశైలం జలాశయం నుంచి నెల్లూరు జిల్లాకు నీటిని తరలించే విషయంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించి జిల్లా రైతాంగానికి తీరని ద్రోహం చేసారంటూ కాకాణి మండిపడ్డారు. శ్రీశైలం జలాశయం నుండి నీటిని సోమశిల, కండలేరు జలాశయాలకు తరలించాలని పలుమార్లు డిమాండ్ చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైలం నుంచి నీటిని సోమశిల, కండలేరు జలాశయాలకు తరలిస్తే నెల్లూరు డెల్టా ప్రాంతంతో పాటు మనుబోలు మండలం, కండలేరు పరివాహక ప్రాంతపు రైతులకు సాగునీరు అందిఉండేదని తెలిపారు. రైపారియన్ హక్కులు ఉన్న రైతులకు నీరు ఇచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు.ఎన్ని ఆందోళనలు చేసినా, ఎంతగా ఒత్తిడి తెచ్చినా శ్రీశైలం నుంచి ఒక్క చుక్క నీరు కూడా వదిలేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన ప్రకటన చేశారని కాకాణి ఆరోపించారు.శ్రీశైలం నుండి జిల్లాకు నీళ్లు తీసుకురావడంలో కూటమి నాయకులు విఫలమయ్యారని మైకుల ముందు ప్రగల్భాలు పలకడమే తప్ప, చంద్రబాబు నిర్ణయంపై నోరు మెదపకపోవడం విచారకరమని అన్నారు. ప్రతి చిన్న విషయానికీ స్పందించే నేతలు రైతు ప్రయోజనాల దగ్గరకు వచ్చేసరికి స్వార్థంతో మౌనంగా ఉండిపోయారని మండిపడ్డారు.కూటమి పాలనకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు దృఢమైన నిర్ణయంతో ఉన్నారని, స్థానికంగా అందరి వద్ద నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మరియు నెల్లూరు జిల్లాలోనే కాకుండా సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ గతంలో కంటే మరింతగా బలపడిందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కూటమిలోని అన్ని పార్టీలను ఒంటరిగా ఢీకొట్టడానికి వైఎస్సార్సీపీ పూర్తి సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. అక్రమాలకు పాల్పడతాం అంటే సహించేది లేదని తేల్చి చెప్పారు. "నేను ఉన్నన్ని రోజులు నెల్లూరు జిల్లాలో కానీ, సర్వేపల్లి నియోజకవర్గంలో కానీ అక్రమార్కుల ఆటలు సాగనివ్వను" అని హెచ్చరించారు.కష్టకాలంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరి రుణం తీర్చుకుంటా..

సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటన పూర్తి చేసుకుని, నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలతో మమేకమై మాట్లాడటం జరిగిందని కాకాణి తెలిపారు. ఈ పర్యటనల ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో సంతృప్తికరమైన ఫలితాలు వస్తాయనే ఆశాభావాన్ని నాయకులు, కార్యకర్తలు వ్యక్తం చేశారని పేర్కొన్నారు.ఈసారి తన ఏకైక కోరిక,భగవంతుడిని కోరుకునేది ఒక్కటే--- కష్టకాలంలో అండగా నిలిచిన సర్వేపల్లి ప్రజల రుణం తీర్చుకోవడానికి భగవంతుడు, జగన్మోహన్ రెడ్డి గారు మరో అవకాశం ఇస్తే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, తన కుటుంబాన్ని అంటిపెట్టుకుని ఉన్న సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల, కార్యకర్తల రుణం తీర్చుకుంటానని తెలియజేశారు, అధికార పక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం ప్రజల పక్షాన నిలబడి అండదండలు అందిస్తానని స్పష్టం చేశారు.

### కాకాణి పూజిత మాట్లాడుతూ

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ధైర్యం అభినందనీయం చంద్రబాబు మోసపు ప్రచారాలను నమ్మే పరిస్థితి లేదు..

కూటమి ప్రభుత్వం ఇస్తున్న బూటకపు హామీలను, చంద్రబాబు మోసపు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. గత 28 నెలలుగా గుర్తురానటువంటి పెన్షన్లు, సంక్షేమ పథకాలు సరిగ్గా ఎలక్షన్లు వచ్చేటప్పుడే గుర్తుకొచ్చాయా అని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం నాటకాలాడుతూ ప్రజలకు ఆశ చూపి మోసం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లపై ప్రశ్నించిన పూజిత గారు..

బీసీలకు 34% రిజర్వేషన్లు ఇస్తామంటూ చంద్రబాబు అబద్ధపు హామీ ఇచ్చారని విమర్శించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి, అధికారం చేతిలో ఉన్నప్పుడు బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించాలనుకుంటే పార్లమెంట్‌లో నేరుగా చట్టం తీసుకురావడానికి ఉన్న అవకాశాన్ని ఎందుకు ఉపయోగించుకోవడం లేదని ప్రశ్నించారు. అది వదిలేసి చంద్రబాబు కోర్టుల నెపంతో మోసపు మాటలు చెబుతున్నారని ధ్వజమెత్తారు.

### స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయం ఖాయం..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘనవిజయం సాధించడం ఖాయమని కాకాణి పూజిత ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పెమ్మసాని పొలిటికల్ హీరో, నాదెండ్ల బెస్ట్ మినిస్టర్.. సీఎం చంద్రబాబు ప్రశంసల వర్షం

- గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌పై సీఎం చంద్రబాబు ప్రశంసలు
- పెమ్మసానిని పొలిటికల్ హీరోగా అభివర్ణించిన ముఖ్యమంత్రి
- ప్రజలతో మమేకమై అద్భుతంగా పనిచేస్తున్నారని కొనియాడిన చంద్రబాబు
- ధరల నియంత్రణలో మంత్రి నాదెండ్ల మనోహర్ సమర్థంగా పనిచేస్తున్నారన్న సీఎం
- పేదల కోసం పనిచేసే మంత్రులుగా ఇరువురిపై కితాబు



బుర్రిపాలెం ( సింధూర దర్శిని) 4 అక్టోబర్ : గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో జరిగిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) ఇళ్ల నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్ లపై ప్రశంసల వర్షం కురిపించారు. వారి పనితీరును కొనియాడుతూ, కూటమి ప్రభుత్వంలో వారి పాత్రను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఒకప్పుడు బుర్రిపాలెం అనగానే సూపర్ స్టార్ కృష్ణ గారు గుర్తొచ్చేవారు. ఇప్పుడు ఇక్కడికి మరో హీరో వచ్చారు. ఆయన సినిమా హీరో అయితే, మన పెమ్మసాని చంద్రశేఖర్ పొలిటికల్ హీరో" అని అభివర్ణించారు. పెమ్మసానిని ఎంపీగా ఎంపిక చేసినప్పుడు తనకు కొన్ని సందేహాలు కలిగాయని చంద్రబాబు బహిరంగంగా అంగీకరించారు. "ఎక్కువకాలం అమెరికాలో ఉన్న పెమ్మసాని, ఇక్కడి ప్రజలతో పట్టు సాధించగలరా? వారితో మమేకం అవుతారా? అని నేను మొదట అనుమానించాను. కానీ ఈరోజు ఆయన ప్రసంగాలు, ప్రజలతో కలిసిపోతున్న తీరు చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ఒక సామాన్యుడిలా ప్రజల్లో ఒకరిగా మారిపోయి, అందరి బాగోగులు చూసుకుంటూ బ్రహ్మాండంగా ముందుకు దూసుకెళుతున్నారు" అని చంద్రబాబు కొనియాడారు. పెమ్మసాని ఆధ్వర్యంలో బుర్రిపాలెంలో చేపడుతున్న 3డి కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ ఇళ్ల నిర్మాణాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది దేశానికే ఆదర్శం కానుందని పేర్కొన్నారు.అదేవిధంగా, జనసేన నాయకుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పనితీరును చంద్రబాబు ఎంతగానో మెచ్చుకున్నారు. "నాకు కేబినెట్‌లో మొదట గుర్తొచ్చేది నాదెండ్ల మనోహర్. నిత్యావసరాల ధరలు కొంచెం పెరిగినా, వెంటనే నాకు ఒక చీటీ పంపించి పరిస్థితిని వివరిస్తారు. ధరలను నియంత్రణలో ఉంచడానికి మేము ఈ చర్యలు తీసుకుంటున్నామని చెబుతారు. పేద ప్రజలపై ధరల భారం పడకుండా అనునిత్యం పనిచేస్తున్న అత్యంత సమర్థవంతమైన మంత్రి మనోహర్" అని ప్రశంసించారు. ఆయన నియోజకవర్గంలో ఈ కార్యక్రమం జరగడంపై సంతోషం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో కీలకమైన శాఖలను నిర్వహిస్తున్న ఈ ఇద్దరు నేతలు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందున్నారని చంద్రబాబు తన ప్రసంగంలో స్పష్టం చేశారు. వారి పనితీరు కూటమి ప్రభుత్వానికి మరింత బలాన్ని చేకూరుస్తోందని ఆయన అన్నారు.



## డ్రైవింగ్ లైసెన్స్ కావాలా?.. ఇకపై ఆ వీడియో కోర్సు తప్పనిసరి!

- డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్‌కు తెలంగాణలో కొత్త నిబంధన
- ఇకపై రెండున్నర గంటల రోడ్డు భద్రత వీడియో కోర్సు తప్పనిసరి
- అభ్యర్థులను గుర్తించేందుకు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ వినియోగం
- పాత, కొత్త ఎల్ఎల్ఆర్ హోల్డర్లందరికీ ఈ నిబంధన వర్తింపు
- రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యమన్న రవాణా శాఖ

హైదరాబాద్, (సింధూర దర్శిని) 4 అక్టోబరు: డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్) పొందాలనుకునే వారి కోసం తెలంగాణ రవాణా శాఖ కొత్త నిబంధనను అమలులోకి తెచ్చింది. ఇకపై డీఎల్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలంటే, తప్పనిసరిగా రహదారి భద్రతపై రూపొందించిన రెండున్నర గంటల నిడివి గల ప్రత్యేక వీడియో కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది. గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ఈ నూతన విధానాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల పెరుగుదలకు డ్రైవర్లకు రహదారి భద్రతా నియమాలపై సరైన అవగాహన లేకపోవడమే ప్రధాన కారణంగా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో, విదేశాల్లోని ఉత్తమ విధానాల స్ఫూర్తితో ఈ ఆన్‌లైన్ వీడియో కోర్సును రూపొందించారు. మొత్తం 64 రకాల రహదారి భద్రతా నియమాలు, ప్రాక్టికల్ డ్రైవింగ్ పాఠాలతో ఈ కోర్సును సిద్ధం చేశారు. 25 నిమిషాల చొప్పున ఆరు మాడ్యూళ్లుగా విభజించిన ఈ వీడియోలు తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు కేవలం వీడియోను ఆన్ చేసి పక్కన పెట్టకుండా, శ్రద్ధగా వీక్షించేలా రవాణా శాఖ పక్కా ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం 'ఫేస్ రికగ్నిషన్' (ముఖ గుర్తింపు) టెక్నాలజీని తప్పనిసరి చేసింది. వీడియో చూస్తున్నంత సేపు దరఖాస్తుదారుడి ముఖం కెమెరాకు స్పష్టంగా కనిపించాలి. అయితే, ఒకేసారి కాకుండా తమకు వీలైనప్పుడు విడతల వారీగా కూడా ఈ కోర్సును పూర్తి చేసే వెసులుబాటును కల్పించారు. మొత్తం కోర్సు పూర్తయ్యాకే డీఎల్ స్లాట్ బుక్ చేసుకోవడానికి సిస్టమ్ అనుమతిస్తుంది. ఈ నిబంధన కేవలం కొత్తగా లెర్నర్ లైసెన్స్ (ఎల్ఎల్ఆర్) తీసుకున్నవారికే కాకుండా, గతంలోనే ఎల్ఎల్ఆర్ పొంది ఇప్పుడు డీఎల్ స్లాట్ బుక్ చేసుకోవాలనుకునే వారికి కూడా వర్తిస్తుందని రవాణా శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ వెంకటరమణ స్పష్టం చేశారు. వాహనదారులకు రోడ్డు భద్రతపై పూర్తి అవగాహన కల్పించి, ప్రమాదాలను నివారించడమే ఈ నూతన విధానం ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు. కూకట్‌పల్లి ఆర్టీవో కార్యాలయంలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో, తొలి దశగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణలో సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్ పాసులు!




- పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- మహిళల మాదిరిగానే వృద్ధులకూ
- ఈ సౌకర్యం కల్పించేందుకు కసరత్తు త్వరలోనే అమలు చేస్తామన్న రవాణా శాఖ
- మంత్రి పొన్నం ప్రభాకర్
- అర్హతలు, విధివిధానాలు ఖరారుపై దృష్టి
- ప్రస్తుతం రాష్ట్రంలో 48 లక్షల మంది వృద్ధులు ఉన్నట్లు అంచనా

హైదరాబాద్, (సింధూర దర్శిని) 4 అక్టోబరు: తెలంగాణలోని సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వయోవృద్ధులకు కూడా వర్తింపజేసే ప్రతిపాదనను సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 1న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళలతో పాటు పురుషులతో సహా వయోవృద్ధులందరికీ ప్రయోజనం చేకూర్చేలా ఈ పథకాన్ని వీలైనంత త్వరగా అమలులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తే వృద్ధులు ఆసుపత్రులు, పుణ్యక్షేత్రాలు, బంధువుల ఇళ్లకు సులువుగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది. అయితే, ఈ పథకానికి సంబంధించిన అర్హతలు, వయో పరిమితి, ఆదాయ పరిమితులు వంటి అంశాలపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రభుత్వం త్వరలోనే దీనిపై పూర్తిస్థాయిలో చర్చించి మార్గదర్శకాలను ఖరారు చేయనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో వృద్ధుల జనాభా గణనీయంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 32.69 లక్షలుగా ఉన్న వీరి సంఖ్య, ఇప్పుడు సుమారు 48 లక్షలకు (12.5 శాతం) చేరినట్లు అంచనా. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వృద్ధుల సంక్షేమానికి చేయూత పెన్షన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తోంది. అయితే, మహాలక్ష్మి పథకంతో ఇప్పటికే టీజీఎస్ఆర్టీసీపై ఆర్థిక భారం పడుతున్న నేపథ్యంలో, సీనియర్ సిటిజన్ల ఉచిత ప్రయాణంతో పడే అదనపు భారం, దానిని భర్తీ చేసే మార్గాలపై ప్రభుత్వం సమీక్ష జరుపుతోంది. అన్ని అంశాలను పరిశీలించి, విధివిధానాలు ఖరారు చేసిన తర్వాతే ఈ పథకం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

## రాత్రంతా కనువిందు.. శనిగ్రహాన్ని చూసే అరుదైన అవకాశం



- నేడు భూమికి అత్యంత దగ్గరగా రానున్న శనిగ్రహం
- రాత్రంతా ఆకాశంలో ప్రకాశవంతంగా కనిపించనున్న వలయాల గ్రహం
- 'ప్రతియోగం' కారణంగా ఈ ఏడాది అత్యంత పెద్దగా, స్పష్టంగా దర్శనం
- కంటితో చూడవచ్చు, టెలిస్కోప్‌తో వలయాలు పరిశీలించవచ్చు
- ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా వెల్లడి

ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతం కానుంది. సౌర కుటుంబంలో తన చుట్టూ ఉన్న వలయాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే శనిగ్రహం, ఆదివారం (అక్టోబర్ 4) భూమికి అత్యంత సమీపంలోకి రానుంది. దీంతో ఆ రోజు రాత్రంతా ప్రకాశవంతంగా మెరుస్తూ ఖగోళ ప్రియులకు కనువిందు చేయనుంది. ప్రతి ఏడాది ఒకసారి జరిగే ఈ అరుదైన సన్నివేశాన్ని 'ప్రతియోగం' అని పిలుస్తారు. ఈ సమయంలో సూర్యుడు, భూమి, శనిగ్రహం ఒకే సరళరేఖపైకి వస్తాయి.
ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఖగోళ అద్భుతం కారణంగా శనిగ్రహం భూమి నుంచి సుమారు 126.17 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఆదివారం సాయంత్రం 5:59 గంటల నుంచి తూర్పు దిక్కున లేత పసుపు రంగులో ఒక ప్రకాశవంతమైన చుక్కలా శనిగ్రహం ఉదయించడం మొదలవుతుంది. దీనిని ఎలాంటి పరికరాల సాయం లేకుండానే కంటితో స్పష్టంగా గుర్తించవచ్చు. సూర్యుడు అస్తమించగానే, శని ప్రకాశం మరింత పెరుగుతుంది. అయితే, ఒక చిన్న టెలిస్కోప్ లేదా బైనాక్యులర్ సాయంతో చూస్తే, ఈ గ్రహం అసలు అందం కళ్లముందు సాక్షాత్కరిస్తుంది. శనిగ్రహం చుట్టూ ఉన్న మంచు, రాతి ముక్కలతో ఏర్పడిన అద్భుతమైన వలయాలను స్పష్టంగా చూసే అవకాశం లభిస్తుంది. 2026 సంవత్సరంలో శనిగ్రహం అత్యంత ప్రకాశవంతంగా (o0.3 మాగ్నిట్యూడ్) కనిపించేది ఈ సమయంలోనే.
సాధారణంగా ప్రతి 378 రోజులకు ఒకసారి భూమి, సూర్యుడికి, శనిగ్రహానికి మధ్యగా వస్తుంది. గతేడాది 2025 సెప్టెంబర్ 21న కూడా ఇలాంటి దృశ్యం ఆవిష్కృతమైంది. ఈసారి వలయాలు మరింత స్పష్టంగా కనిపించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఆదివారం రాత్రంతా ఆకాశంలో కనిపించే శని, అర్ధరాత్రి సమయానికి నడినెత్తిన ఉండి, తెల్లవారుజామున పడమటి దిక్కున అస్తమిస్తుంది. నగరాల్లోని కాంతి కాలుష్యం తక్కువగా ఉన్న ప్రాంతాలకు లేదా శివారు ప్రాంతాలకు వెళ్తే ఈ దృశ్యాన్ని మరింత స్పష్టంగా ఆస్వాదించవచ్చు. ఖగోళ ప్రియులకు, ఆకాశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరికీ ఇది ఒక పండుగలాంటి అవకాశం. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఈ అద్భుతాన్ని వీక్షించవచ్చు.

## రూ.1.11 లక్షల నుంచే ఎప్రిలియా ఎస్ఎక్స్ఆర్ జీటీ!

- ఎప్రిలియా ఎస్ఎక్స్ఆర్ జీటీ సిరీస్‌లో రెండు స్కూటర్లు విడుదల
- ఎస్ఎక్స్ఆర్ జీటీ 125 ధర రూ.1.11 లక్షలు
- ఎస్ఎక్స్ఆర్ జీటీ 175 ధర రూ.1.31 లక్షలు
- జీటీ 175లో టీఎఫ్‌టీ డిస్‌ప్లే, బ్లూటూత్
- జీటీ 175లో సింగిల్ ఛానల్ ఏబీఎస్




ప్రీమియం మ్యాక్సీ స్కూటర్ కోరుకునే వారికి ఎప్రిలియా గుడ్‌న్యూస్ చెప్పింది. ఎస్ఎక్స్ఆర్ జీటీ సిరీస్‌లో రెండు కొత్త స్కూటర్లను భారత మార్కెట్‌లో విడుదల చేసింది. ఎస్ఎక్స్ఆర్ జీటీ 125 ధర రూ.1.11 లక్షలు కాగా.. ఎస్ఎక్స్ఆర్ జీటీ 175 ధర రూ.1.31 లక్షలుగా నిర్ణయించింది. ఇవి రెండూ ఎక్స్-షోరూమ్ ధరలు. గతంలో ఉన్న ఎస్ఎక్స్ఆర్ 125, ఎస్ఎక్స్ఆర్ 160 మోడళ్లను నిలిపివేసిన తర్వాత కొత్త జీటీ సిరీస్‌ను కంపెనీ తీసుకొచ్చింది.

### రెండు ఇంజిన్లు.. రెండు ధరలు

ఎస్ఎక్స్ఆర్ జీటీ 125లో 124.5సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఉంది. ఇది 10.6 బ్రేక్ హార్స్ పవర్, 10.4 ఎన్ఎం టార్క్ అందిస్తుంది. ఎస్ఎక్స్ఆర్ జీటీ 175లో 174.7సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఉంటుంది. ఇది 13.3 బ్రేక్ హార్స్ పవర్, 14.1 ఎన్ఎం టార్క్ ఇస్తుంది. రెండు ఇంజిన్లు బీఎస్6 ఓబీడీ-II స్టేజ్ బీ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయి. ఈ20 పెట్రోల్‌ను కూడా ఇవి సపోర్ట్ చేస్తాయి.

### 14 అంగుళాల వీల్స్ ప్రత్యేకత

కొత్త ఎస్ఎక్స్ఆర్ జీటీ సిరీస్‌లో కీలక మార్పుల్లో 14 అంగుళాల వీల్స్ ఒకటి. పెద్ద వీల్స్ వల్ల గుంతలు, అసమాన రోడ్లపై స్కూటర్ స్థిరంగా ఉండే అవకాశం ఉంటుంది. నగర రోడ్లపై కొంచెం ఎక్కువ వేగంతో వెళ్లేటప్పుడు కూడా రైడర్‌కు మరింత నమ్మకం కలిగించొచ్చు.

### జీటీ 175లో అదనపు ఫీచర్లు

ఎస్ఎక్స్ఆర్ జీటీ 175లో 5 అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే ఉంది. బ్లూటూత్ కనెక్టివిటీ ద్వారా కాల్స్, మ్యూజిక్ కంట్రోల్స్ ఉపయోగించుకోవచ్చు. టర్న్-బై-టర్న్ నావిగేషన్ కూడా అందుబాటులో ఉంటుంది. అదనంగా హ్యాండిల్‌బార్ కంట్రోల్స్, సింగిల్-ఛానల్ ఏబీఎస్ ఉన్నాయి. ఎగ్జాస్ట్ ఎండ్ పైప్, హీట్ షీల్డ్‌లో కూడా మార్పులు చేశారు.

### జీటీ 125లో ఎలా ఉన్నాయి?

ఎస్ఎక్స్ఆర్ జీటీ 125లో 5 అంగుళాల ఎల్‌సీడీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంది. ఇందులో ఏబీఎస్‌కు బదులుగా సీబీఎస్ బ్రేకింగ్ సిస్టమ్ ఇచ్చారు. చిన్న ఇంజిన్, ఈ బ్రేకింగ్ సెటప్ కారణంగా 175తో పోలిస్తే దీని ధర తక్కువగా ఉంది. మొత్తంగా చూస్తే కొత్త ఎస్ఎక్స్ఆర్ జీటీ సిరీస్‌లో పాత మ్యాక్సీ స్కూటర్ డిజైన్‌ను కొనసాగిస్తూనే.. కొత్త ఇంజిన్లు, పెద్ద వీల్స్, అప్‌డేటెడ్ ఫీచర్లను తీసుకొచ్చింది. నగర ప్రయాణాలతో పాటు ఎక్కువ దూరం వెళ్లేవారిని దృష్టిలో పెట్టుకుని జీటీ సిరీస్‌ను రూపొందించారు.

## రెండేళ్లలో ఇలాంటి రైలు బోగీలు కనిపించవు!

- 2028 నాటికి రైళ్ల నుంచి ఐసీఎఫ్ కోచ్‌లకు వీడ్కోలు
- ప్రయాణికుల భద్రతను పెంచడమే ప్రధాన లక్ష్యం
- పాత కోచ్‌ల స్థానంలో అధునాతన ఎల్‌హెచ్‌బీ, అమృత్ భారత్ రైళ్లు
- ఇప్పటికే 1600కు పైగా రైళ్లలో కోచ్‌ల మార్పు పూర్తి
- భవిష్యత్తులో పుష్-పుల్ టెక్నాలజీతో కూడిన రైళ్లపై రైల్వే శాఖ దృష్టి




ప్రయాణికుల భద్రతను పెంచే దిశగా భారతీయ రైల్వే ఓ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా నడుస్తున్న మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పాత ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (×జఖీ) కోచ్‌లను పూర్తిగా తొలగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2027-28 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి, వాటి స్థానంలో అధునాతన, సురక్షితమైన లింక్ హాఫ్‌మన్ బుష్ (ూఎదీ) కోచ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళికలు రచిస్తోంది. రైల్వే శాఖ నివేదికల ప్రకారం, దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 2,000 రైళ్లలో ఇప్పటికే 1,600కు పైగా రైళ్లలో ఐసీఎఫ్ కోచ్‌లను ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో భర్తీ చేశారు. మిగిలి ఉన్న 340 నుంచి 350 రైళ్లలో కూడా ఈ మార్పును వేగవంతం చేయనున్నారు. రాబోయే రెండేళ్లలో, అంటే 2027, 2028 ఆర్థిక సంవత్సరాల్లో ఏటా 170-180 రైళ్ల చొప్పున పాత కోచ్‌లను మార్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఐసీఎఫ్ కోచ్‌లను తొలగించడానికి ప్రధాన కారణం భద్రతాపరమైన లోపాలే. ఈ పాత కోచ్‌లు ప్రమాదాలకు గురైనప్పుడు ఒకదానికొకటి గుద్దుకుని, ఒకదానిపై ఒకటి ఎక్కే (టెలిస్కోపింగ్) ప్రమాదం ఎక్కువగా ఉంది. దీనివల్ల ప్రాణనష్టం అధికంగా సంభవిస్తుంది. ఈ సమస్యను అధిగమించేందుకే రైల్వే శాఖ 2018లోనే ఐసీఎఫ్ కోచ్‌ల తయారీని నిలిపివేసింది. ఐసీఎఫ్ కోచ్‌ల మార్పిడి పూర్తయ్యాక, రైల్వే శాఖ కొత్త రైళ్ల తయారీలో మరో ముందడుగు వేయనుంది. భవిష్యత్తులో మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లను 'అమృత్ భారత్' ప్లాట్‌ఫామ్ ఆధారంగా, పుష్-పుల్ టెక్నాలజీతో నిర్మించనున్నారు. ఈ రైళ్లకు రెండు వైపులా ఇంజిన్లు ఉండటం వల్ల, రైలు ప్రారంభమయ్యేటప్పుడు కుదుపులు లేకుండా సాఫీగా కదులుతుంది. అలాగే, అధిక వేగంతో ప్రయాణిస్తున్నప్పుడు కూడా మెరుగైన భద్రతను అందించేలా సెమీ-రిజిడ్ కప్లర్లను వినియోగిస్తారు. అయితే, కొన్ని ఐసీఎఫ్ కోచ్‌లను ప్రత్యేక రైళ్లు, డిమాండ్‌పై నడిపే రైళ్లు, రైల్వే శాఖ అంతర్గత అవసరాల కోసం వినియోగించనున్నారు. తుప్పు పట్టిన కోచ్‌లను త్వరగా స్క్రాప్‌కు పంపేందుకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నారు. ఇకపై తయారు చేసే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను కూడా పుష్-పుల్ టెక్నాలజీకి అనువుగా నిర్మించాలని ఉత్పత్తి యూనిట్లకు రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసింది.

## సింగీతంకు కన్నీటి వీడ్కోలు.. చెన్నైలో ముగిసిన అంత్యక్రియలు



**చెన్నై:** భారతీయ సినీ యవనికపై తనదైన ముద్ర వేసిన విలక్షణ దర్శకుడు, లెజెండరీ ఫిలింమేకర్ సింగీతం శ్రీనివాసరావు అంత్యక్రియలు ముగిశాయి. చెన్నైలో ఆదివారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు చెన్నైలోని నేసపాక్కం శ్మశానవాటికలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సినీ ప్రముఖుల అశ్రు నయనాల మధ్య పూర్తయ్యాయి. భారతీయ సినిమాకు దశాబ్దాల పాటు విశేష సేవలందించిన ఓ మహోన్నత అధ్యాయం ఆయన మరణంతో ముగిసినట్లయింది. వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సింగీతం శ్రీనివాసరావు (94), చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన భౌతికకాయాన్ని చెన్నై విరుగంబాక్కంలోని ఆయన నివాసానికి తరలించారు. ఆదివారం ఉదయం నుంచి పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి నివాళులర్పించారు. సింగీతంతో ఎన్నో చారిత్రక చిత్రాల్లో పనిచేసిన విశ్వనటుడు కమల్ హాసన్, ఆయన నివాసానికి చేరుకుని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సింగీతం కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# వయసు 90, మనసు ఉక్కు.. జపాన్ బాడీబిల్డర్ స్ఫూర్తి గాథ!

- 90 ఏళ్ల వయసులో జాతీయ బాడీబిల్డింగ్ టైటిల్ సాధించిన వృద్ధుడు
- ఇప్పటివరకు 19 జాతీయ, 6 ప్రపంచ టైటిళ్లు కైవసం
- భార్య కోసం 50వ ఏట మళ్లీ పోటీల్లోకి పునరాగమనం
- పూర్తి శాకాహారి, రోజుకు రెండు గంటల కఠినమైన వ్యాయామం
- చనిపోయే వరకు బాడీబిల్డర్‌గా ఉండటమే లక్ష్యమన్న కనజావా



వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నిరూపించే వారు కొందరే ఉంటారు. అలాంటి వారిలో ముందు వరుసలో నిలుస్తారు జపాన్‌కు చెందిన తోషిసుకె కనజావా. 90 ఏళ్ల వయసులో కూడా ఆయన సాధించిన ఘనత చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. తన 90వ పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న మరుసటి రోజే, ఆయన మరో జాతీయ బాడీబిల్డింగ్ టైటిల్‌ను గెలుచుకుని ప్రపంచాన్ని అబ్బురపరి చారు. 'ఆల్ జపాన్ మాస్టర్స్ ఫిట్‌నెస్ ఛాంపియన్‌షిప్'లో 85 ఏళ్లు పైబడిన విభాగంలో విజేతగా నిలిచి, తన కెరీర్‌లో 19వ జాతీయ టైటిల్‌ను సగర్వంగా అందుకున్నారు. హిరోషిమాకు చెందిన కనజావా ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకం. 1936లో జన్మించిన ఆయన, యుక్తవ యసులో ఈతగాడిగా ఒలింపిక్స్‌లో పాల్గొనాలని కలలు కన్నారు. అయితే కండరాల సమస్య కారణంగా ఆ కలను వదులుకుని, తన దృష్టిని బాడీబిల్డింగ్ వైపు మళ్లించారు. తన 24, 27వ ఏట 'మిస్టర్ జపాన్' టైటిళ్లను గెలుచుకుని సత్తా చాటారు. అయి తే, 34 ఏళ్ల వయసులో పోటీలకు వీడ్కోలు పలికారు. కానీ విధి ఆయనను మళ్లీ పోటీల వైపు నడిపించింది. ఆరోగ్యం బాగోలేని తన భార్యలో స్ఫూర్తి నింపడానికి, 50 ఏళ్ల వయసులో మళ్లీ కండల ప్రదర్శనకు సిద్ధమయ్యారు. ఆ పునరాగమనం ఆయన జీవితంలో చారిత్రాత్మకంగా నిలిచింది. అప్పటి నుంచి వెనుదిరిగి చూడని ఆయన, 80 ఏళ్లు దాటిన తర్వాత ఆరు వరల్డ్ మాస్టర్స్ టైటిళ్లను గెలుచుకోవడం విశేషం.కనజావా విజయ రహస్యం ఆయన జీవనశైలిలోనే దాగి ఉంది. ఆయన పూర్తి శాకాహారి. గత 50 ఏళ్లుగా మాంసం, చేపలకు దూరంగా ఉంటున్నారు. బ్రౌన్ రైస్, పులియబెట్టిన సోయాబీన్స్‌తో చేసే నాటో, మిసో సూప్ వంటి సంప్రదాయ జపనీస్ ఆహారంతో పాటు ప్రొటీన్ సప్లిమెంట్లు తీసుకుంటారు. వయసు మీద పడుతున్నా, క్రమశిక్షణ మాత్రం వీడలేదు. వారంలో ఆరు రోజులు, రోజుకు రెండు గంటల పాటు జిమ్‌లో కఠోరంగా శ్రమి స్తారు. వయసును దృష్టిలో ఉంచుకుని భారీ బరువులకు బదులుగా మెషీన్లపై ఎక్కువ దృష్టి సారిస్తున్నారు.ప్రముఖ హాలీవుడ్ నటుడు, బాడీబిల్డర్ ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగ్గర్‌ను కలవా లనేది తన చిరకాల కోరిక అని కనజావా చెబుతారు. "చనిపోయే వరకు బాడీబిల్డర్‌గా ఉంటాను" అని ఆయన చెప్పే మాటలు ఆయన పట్టుదలకు, క్రీడ పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనం. ప్రస్తుతం హిరోషిమాలో సొం తంగా జిమ్ నడుపుతున్న ఈ ఉక్కు మనిషి, వృద్ధాప్యంలో శారీరకంగా, మానసికంగా ఎలా దృఢంగా ఉండవచ్చో ప్రపంచానికి చాటిచెబుతూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

## తన జుట్టు తానే తిన్న బాలిక.. కడుపులో కిలో వెంట్రుకల గడ్డ.. అసలేంటీ 'రాపుంజెల్ సిండ్రోమ్'?



- కేరళలో 9 ఏళ్ల బాలిక కడుపు నుంచి కిలో జుట్టు తొలగింపు
- రాపుంజెల్ సిండ్రోమ్ అనే అరుదైన వ్యాధిగా గుర్తించిన వైద్యులు
- తీవ్రమైన కడుపునొప్పి, వాంతులతో ఆసుపత్రిలో చేరిన చిన్నారి
- శస్త్రచికిత్స విజయవంతం, బాలిక పూర్తిగా కోలుకుందని వెల్లడి

**కేరళ:** వైద్య శాస్త్రంలోనే అత్యంత అరుదుగా కనిపించే కేసు ఒకటి కేరళలో వెలుగుచూసింది. 9 ఏళ్ల బాలిక కడుపులో పేరుకుపోయిన కిలో బరువున్న వెంట్రుకల గడ్డను వైద్యులు విజయవంతంగా తొలగించారు. తీవ్రమైన కడుపునొప్పి, వాంతులతో బాధపడుతున్న ఆ చిన్నారికి 'రాపుంజెల్ సిండ్రోమ్' అనే అరుదైన వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఘటన తిరువనంతపురం సమీపంలోని నెయ్యాట్టింకరలో ఉన్న నిమ్స్ మెడిసిటీ ఆసుపత్రిలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే.. కొద్ది రోజులుగా తగ్గని కడుపునొప్పి, తరచూ వాంతులు అవుతుండటంతో కుటుంబ సభ్యులు బాలికను నిమ్స్ మెడిసిటీకి తీసుకొచ్చారు. ప్రాథమికంగా సమస్యను గుర్తించలేని వైద్యులు, బాలిక ఆరోగ్య పరిస్థితిని లోతుగా పరిశీలించేందుకు అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో బాలిక జీర్ణాశయంలో, చిన్న పేగుల్లో ఏదో అసాధారణమైన అడ్డంకి ఉన్నట్లు గుర్తించారు.దీంతో మరింత స్పష్టత కోసం ఎండోస్కోపీ పరీక్ష నిర్వహించగా, వైద్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. బాలిక కడుపు, చిన్న పేగుల్లో పెద్ద మొత్తంలో వెంట్రుకలు ఒక ముద్దలా పేరుకుపోయి ఉన్నాయని తేలింది. ఈ వెంట్రుకల గడ్డ కారణంగానే పేగుల్లో తీవ్రమైన అడ్డంకి ఏర్పడిందని, దానివల్లే బాలిక అనారోగ్యానికి గురైందని నిర్ధారించారు. వెంటనే శస్త్రచికిత్స చేసి దానిని తొలగించాలని నిర్ణయించారు.పీడియాట్రిక్ సర్జరీ విభాగం వైద్య బృందం ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను చేపట్టింది. గంటల తరబడి శ్రమించి, బాలిక కడుపు, చిన్న పేగుల నుంచి సుమారు కిలో బరువున్న వెంట్రుకల గడ్డను పూర్తిగా తొలగించారు. ఈ వైద్య పరిస్థితిని 'రాపుంజెల్ సిండ్రోమ్' అని పిలుస్తారని వైద్యులు వివరించారు.

### ఏమిటీ రాపుంజెల్ సిండ్రోమ్?

ఇది ఒకరకమైన 'ట్రైకోబెజోర్' (వెంట్రుకల గడ్డ). తమ వెంట్రుకలను తామే పీక్కుని తినే మానసిక అలవాటు (ట్రైకోఫేజియా) ఉన్నవారిలో ఇది కనిపిస్తుంది. మింగిన వెంట్రుకలు జీర్ణం కాక కడుపులో పేరుకుపోయి గడ్డలా మారతాయి. ఈ గడ్డ కడుపు నుంచి తోకలాగా చిన్న పేగుల్లోకి విస్తరిస్తే దానిని 'రాపుంజెల్ సిండ్రోమ్' అంటారు. ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత అరుదుగా సంభవిస్తుంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 100 లోపే ఇలాంటి కేసులు నమోదైనట్లు వైద్య నివేదికలు చెబుతున్నాయి. ఇది ఎక్కువగా యుక్తవయసు బాలికలలో కనిపిస్తుంది.శస్త్రచికిత్స అనంతరం బాలిక పూర్తిగా కోలుకుందని, సాధారణంగా ఆహారం తీసుకోవడం ప్రారంభించిందని వైద్యులు తెలిపారు. కొన్ని రోజుల పర్యవేక్షణ తర్వాత ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు నిమ్స్ మెడిసిటీ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. సరైన సమయంలో వ్యాధిని గుర్తించి, క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందాన్ని పలువురు అభినందించారు.

## 15 ఏళ్ల భారత బ్యాటర్‌ను హేళన చేసిన పాక్ ఆల్‌రౌండర్

### సైమ్ అయ్యూబ్‌కు బుద్ధుందా? అంటూ సొంత దేశ మాజీ క్రికెటర్ ఫైర్!

- ఆసియా క్రీడల ఫైనల్‌లో పాక్ ఆటగాడి దురుసు ప్రవర్తన
- 15 ఏళ్ల భారత ఓపెనర్‌కు వెక్కిరింత సెండాఫ్
- సోషల్ మీడియా కోసమే ఇలాంటి పిచ్చి పనులు అన్న కమ్రాన్ అక్మల్
- అదే ఓవర్‌లో ప్రతీకారం తీర్చుకున్న భారత బ్యాటర్లు
- స్వర్ణం గెలిచి సత్తా చాటిన టీమిండియా




ఆసియా క్రీడలు 2026 క్రికెట్ ఫైనల్‌లో భారత యువ బ్యాటర్ పట్ల పాకిస్థాన్ ఆల్‌రౌండర్ సైమ్ అయ్యూబ్ ప్రవర్తించిన తీరుపై ఆ దేశ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. 15 ఏళ్ల కుర్రా డిని ఔట్ చేసి, చిన్నపిల్లాడికి జోల పాడినట్టు సైగలు చేయడంపై మండిపడ్డాడు. ఆటపై కాకుండా సోషల్ మీడియాలో గుర్తింపు కోసం పాకులాడితే ఇలాగే ఉంటుందని చురకలంటించాడు.నిన్న భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన స్వర్ణ పతక పోరులో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో భారత యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని (15) సైమ్ అయ్యూబ్ ఔట్ చేశాడు. 9 బంతుల్లో 15 పరుగులు చేసిన వైభవ్ పెవిలియన్‌కు వెళ్తుండగా, అయ్యూబ్ అతని వయసును హేళన చేస్తూ.. చిన్న పిల్లాడిని ఊపుతున్నట్టు చేతులతో సైగలు చేశాడు. ఈ చర్యపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.ఈ ఘటనపై ఓ స్పోర్ట్స్ షోలో కమ్రాన్ అక్మల్ ఘాటుగా స్పందించాడు. "ఇలాంటివి ఎప్పటినుంచో జరుగుతున్నాయి. మైదానంలో మా ప్రదర్శన ఏమీ గొప్పగా లేదు, కానీ సోషల్ మీడియా కోసం ఇలాంటి పనులు చేస్తున్నాం. యాజమాన్యం దీని గురించి ఆలోచించాలి. ఇది అంతర్జాతీయ క్రికెట్. ప్రత్యర్థి వయసు 13, 14, 15 ఏదైనా కావచ్చు, కానీ అతను దేశం తరఫున ఆడుతున్నాడు. సైమ్ అయ్యూబ్ చిన్నపిల్లాడు కాదు. తన ఆటపై దృష్టి పెట్టాలి" అని అక్మల్ హితవు పలికాడు.అయితే, అయ్యూబ్ వెక్కిరింతలకు అదే ఓవర్‌లో భారత బ్యాటర్లు గట్టి సమాధానం ఇచ్చారు. క్రీజులో ఉన్న అభిషేక్ శర్మ.. అయ్యూబ్ బౌలింగ్‌లోనే ఓ భారీ సిక్సర్, రెండు బౌండరీలు బాది ప్రతీకారం తీర్చుకున్నాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా భారీ స్కోరు సాధించి, పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించింది. దీంతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఫలితంగా అయ్యూబ్ చేష్టలు కేవలం అనాలోచిత చర్యలుగా, క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా మిగిలిపోయాయి.



## ఆన్‌లైన్ సేల్స్‌లో 60% ఆఫర్.. అసలు నిజమా? డార్క్ ప్యాటర్న్ మోసమా?

- పండగ సేల్స్‌లో వినియోగదారులను మోసగించే డార్క్ ప్యాటర్న్స్
- ఈ మోసాల వల్ల భారతీయులు ఏటా రూ.28,000 కోట్లు నష్టపోతున్నారని అంచనా
- డార్క్ ప్యాటర్న్స్‌ను అరికట్టేందుకు 2027 జనవరి 1 నుంచి కొత్త ఈ-కామర్స్ నిబంధనలు
- తప్పుడు ఆఫర్లకు మోసపోకుండా ధరలను సరిచూసుకోవాలని నిపుణుల సూచన

పండగ సీజన్ వచ్చిందంటే చాలు, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్రా వంటి ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు భారీ ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షిస్తుంటాయి. 60శాతం, 70శాతం డిస్కౌంట్ అంటూ ఊరించే ప్రకటనలు చూసి చాలామంది షాపింగ్‌కు సిద్ధమవుతారు. అయితే, ఈ ఆఫర్ల వెనుక 'డార్క్ ప్యాటర్న్స్' అని పిలిచే ఒకరకమైన మోసపూరిత డిజైన్ పద్ధతులు ఉన్నాయని, ఇవి మన కొనుగోలు నిర్ణయాలను ప్రభావితం చేస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటి గురించి తెలుసుకోకపోతే భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది.

### ఏమిటీ డార్క్ ప్యాటర్న్స్?

డార్క్ ప్యాటర్న్స్ అంటే వినియోగదారులను మానసికంగా ప్రభావితం చేసి, వారు అనుకోని వస్తువులను కొనేలా లేదా ఎక్కువ డబ్బు ఖర్చు చేసేలా ప్రేరేపించే డిజైన్ టెక్నిక్స్. ఉదాహరణకు, 'కొన్ని మాత్రమే మిగిలి ఉన్నాయి' లేదా 'ఆఫర్ మరికొద్ది సేపట్లో ముగుస్తుంది' అంటూ కౌంట్‌డౌన్ టైమర్లు పెట్టి మనలో ఆతృతను పెంచుతారు. దీనివల్ల ఆలోచించకుండా వెంటనే కొనేస్తాం. అలాగే, ఒక వస్తువు అసలు ధరను కృత్రిమంగా పెంచి, దానిపై అధిక డిస్కౌంట్ ఇస్తున్నట్లు చూపడం కూడా ఇందులో భాగమే. చాలా సందర్భాల్లో, మనం వస్తువులను కార్ట్‌లో యాడ్ చేశాక, మనకు తెలియకుండానే అదనపు యాడ్-ఆన్‌లు లేదా వారంటీలు చేరిపోతాయి. చివరికి చెక్-అవుట్ దశలో డెలివరీ లేదా ప్యాకేజింగ్ పేరుతో అదనపు ఛార్జీలు ప్రత్యక్షమవుతాయి. ఇవన్నీ డార్క్ ప్యాటర్న్స్‌లో భాగమే.

### భారీ నష్టం.. ప్రభుత్వ చర్యలు

ఈ డార్క్ ప్యాటర్న్స్ కారణంగా భారతీయ వినియోగదారులు ఏటా సుమారు రూ.25,000 కోట్ల నుంచి రూ.28,000 కోట్ల వరకు నష్టపోతున్నారని డేటమ్ ఇంటెలిజెన్స్ సంస్థ 2026లో జరిపిన ఒక అధ్యయనంలో తేలింది. ఆసక్తికరంగా, 81శాతం మంది వినియోగదారులకు ఇలాంటి మోసాల గురించి అవగాహన ఉన్నప్పటికీ, 85శాతం మంది తాము ఏదో ఒక సందర్భంలో మోసపోయామని అంగీకరించారు.ఈ సమస్య తీవ్రతను గుర్తించిన కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ), మొత్తం 13 రకాల డార్క్ ప్యాటర్న్స్‌ను గుర్తించి మార్గదర్శకాలను విడుదల చేసింది. దీనికి కొనసాగింపుగా, ప్రభుత్వం ఈ-కామర్స్ నిబంధనలను సవరించింది. 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్న ఈ కొత్త నిబంధనల ప్రకారం ప్రతి ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఒక వస్తువుకు గత 30 రోజుల్లో ఉన్న అత్యల్ప ధరను తప్పనిసరిగా ప్రదర్శించాలి. డిస్కౌంట్లు, ఇతర ఛార్జీల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలి. ఇప్పటికే కొన్ని ప్రధాన ప్లాట్‌ఫామ్‌లు ఈ నిబంధనలను పాటిస్తామని స్వీయ-ధ్రువీకరణ పత్రాలు సమర్పించాయి.

### వినియోగదారులు ఏం చేయాలి?

ఈ ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. ఏదైనా వస్తువును కొనే ముందు, దాని ధర గత కొన్ని రోజులుగా ఎలా ఉందో తనిఖీ చేయాలి. ఇందుకోసం ప్రైస్ హిస్టరీ ట్రాకింగ్ వెబ్‌సైట్లను ఉపయోగించుకోవచ్చు. ఒకే వస్తువును వేర్వేరు ప్లాట్‌ఫామ్‌లలో పోల్చి చూసి, తుది చెల్లింపు మొత్తం ఎక్కడ తక్కువగా ఉందో నిర్ధారించుకోవాలి.

# సినిమా న్యూస్

## జాన్వీ మార్ఫింగ్ వీడియో: ఇది సిగ్గుచేటైన చర్య అంటూ కుష్బూ ఫైర్

- 'దేవర' సినిమా పాటలో జాన్వీ కపూర్ మార్ఫింగ్ వీడియోపై నటి కుష్బూ ఆగ్రహం
- ఇది క్రూరమైన, అవమానకరమైన చర్య అని, మహిళల గౌరవాన్ని కించపరచడమేనని వ్యాఖ్య
- ఇలాంటివి సృష్టించే, షేర్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- జాన్వీకి అండగా నిలుస్తున్నానని, ధైర్యంగా ఉండాలని సూచన



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ నటి జాన్వీ కపూర్‌కు సంబంధించిన మార్ఫింగ్ వీడియోను సృష్టించడంపై సీనియర్ నటి, రాజకీయ నాయకురాలు కుష్బూ సుందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దేవర' సినిమాలోని 'చుట్టమల్లె' పాటను మార్ఫింగ్ చేసి వైరల్ చేయడంపై ఆమె మండిపడ్డారు. ఇది వినోదం కాదని, ఒక మహిళ గౌరవానికి భంగం కలిగించే సిగ్గుచేటైన చర్య అని కుష్బూ ఘాటుగా స్పందించారు.
ఈ ఘటనపై తన ఎక్స్ ఖాతాలో కుష్బూ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "ఏఐ ద్వారా చేసిన ఈ పని అస్సలు జోక్ కాదు. దీన్ని వినోదంగా గానీ, సాధారణ విషయంగా గానీ చూడకూడదు. ఇది చాలా క్రూరమైన, అవమానకరమైన, సిగ్గుచేటైన చర్య. దీని ద్వారా ఆమె గౌరవాన్ని చించివేశారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక మహిళను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి మార్ఫింగ్ వీడియోలు సృష్టించడం, వాటిని ప్రచారం చేయడం నన్ను తీవ్రంగా కలచివేసింది. టెక్నాలజీని ఆయుధంగా వాడి తన గౌరవానికి, భద్రతకు భంగం కలిగిస్తారనే భయంతో ఏ మహిళా బతకకూడదు. ఈ రోజు ఇది ఆమెకు జరిగింది, రేపు నాకు, మీకు, మన కూతురికి, సోదరికి, తల్లికి.. మనం ప్రేమించే ఏ మహిళకైనా జరగవచ్చు. బాధితులం మనం కాదు కదా అని మౌనంగా ఉండకూడదు. ఒక మహిళ గౌరవంపై దాడి జరిగినప్పుడు, ప్రతీ మహిళ నిలబడి గొంతు విప్పాలి" అని ఆమె పిలుపునిచ్చారు. ఇలాంటి కంటెంట్ సృష్టించే వారిని, తెలిసి కూడా వాటిని షేర్ చేసేవారిని, ప్రోత్సహించేవారిని కఠినంగా శిక్షించాలని కుష్బూ డిమాండ్ చేశారు. అప్పుడే ఇతరులకు ఇదొక గుణపాఠంగా మిగులుతుందని అభిప్రాయపడ్డారు. "మహిళ శరీరం వినోద వస్తువు కాదు. ఆమె గౌరవం ఆటబొమ్మ కాదు. ఆమె అవమానం హాస్యాస్పదం కాదు. ఏఐ టెక్నాలజీ ఎప్పటికీ మహిళలపై ఆయుధంగా మారకూడదు. మహిళలంతా ఏకమై 'ఇక చాలు' అని చెప్పాలి" అంటూ ఆమె స్పష్టం చేశారు. చివరగా, "జాన్వీ కపూర్.. నేను నీకు అండగా ఉన్నాను. ధైర్యంగా ఉండు బేటా" అని ఆమెకు భరోసా ఇచ్చారు. ఇదే విషయంపై శనివారం జూనియర్ ఎన్టీఆర్ కూడా స్పందించి, ఏఐ టెక్నాలజీతో ఫేక్ వీడియోలు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి వాటిని ప్రచారం చేసే వారికి కూడా అవే పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు. వీరితో పాటు మెగాస్టార్ చిరంజీవి, విజయ్ దేవరకొండ కూడా సోషల్ మీడియా వేదికగా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.

## సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత.. 'మయూరి' సుధా చంద్రన్ భావోద్వేగ స్పందన

- సినిమాల్లో ఆయనే తన తొలి గురువు అంటూ నటి సుధా చంద్రన్ నివాళి
- 'మయూరి' చిత్రంతో తనను అద్భుతంగా తీర్చిదిద్దారని భావోద్వేగం
- బంకమట్టిలా ఉన్న నన్ను ఓ నటిగా మలిచారన్న సుధా చంద్రన్
- సింగీతం మృతికి రాజమౌళి, కమల్ హాసన్, జూ.ఎన్టీఆర్ సహా సినీ ప్రముఖుల సంతాపం



ప్రముఖ దర్శకుడు, భారత సినీ రంగంలో తనకంటూ ఓ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న సింగీతం శ్రీనివాసరావు కన్నుమూశారు. ఆయన మరణవార్తతో యావత్ సినీ పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. ఈ నేపథ్యంలో, ఆయన దర్శకత్వంలో 'మయూరి' చిత్రంతో అరంగేట్రం చేసిన ప్రముఖ నటి, శాస్త్రీయ నర్తకి సుధా చంద్రన్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సింగీతంను తన తొలి సినీ గురువుగా అభివర్ణిస్తూ సోషల్ మీడియాలో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు."సినిమాల్లో నా తొలి గురువు సింగీతం గారే. ఈ రోజు నా నటనకు, సాంకేతిక అంశాలపై నా అవగాహనకు ప్రశంసలు వస్తున్నాయంటే, ఆ ఘనత మొత్తం మీకే దక్కుతుంది సర్. మీ దర్శకత్వంలోకి వచ్చినప్పుడు నేను ఒక బంకమట్టిలాంటి దాన్ని. నన్ను ఎంతో అందంగా మీరే మలిచారు" అని సుధా చంద్రన్ పేర్కొన్నారు. సింగీతంను ఒక దార్శనికుడిగా, గొప్ప వ్యక్తిగా అభివర్ణించిన ఆమె, ఆయన ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారని గుర్తుచేసుకున్నారు. తన జీవితంలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందని చెబుతూ ఆవేదన వ్యక్తం చేశారు.తెలుగు, తమిళం, హిందీ సహా పలు భారతీయ భాషల్లో వినూత్నమైన కథనాలతో ప్రయోగాత్మక చిత్రాలు తీసి సింగీతం శ్రీనివాసరావు తనదైన ముద్ర వేశారు. 'రాజా పార్వై', 'విచిత్ర సోదరులు', 'మైఖేల్ మదన కామరాజు', 'కథాలా కథాలా', 'లిటిల్ జాన్' వంటి ఎన్నో అద్భుతమైన చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. సింగీతం మృతి పట్ల భారత సినీ పరిశ్రమ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. కమల్ హాసన్, ఎస్.ఎస్. రాజమౌళి, జూనియర్ ఎన్టీఆర్, విక్టరీ వెంకటేశ్, నాని, విజయ్ దేవరకొండ, రవితేజ, విష్ణు మంచు వంటి అనేక మంది సినీ ప్రముఖులు నివాళులర్పించారు. భారత సినిమాకు ఆయన చేసిన సేవలను, విలక్షణమైన దర్శకత్వ శైలిని స్మరించుకుంటూ సోషల్ మీడియా వేదికగా తమ సంతాపాన్ని ప్రకటించారు.

## చనాలు పెంచిన 'భోగి' టీజర్.. కమ్మరి గంగగా శర్వానంద్ విశ్వరూపం!

- శర్వానంద్, సంపత్ నంది కాంబోలో వస్తున్న 'భోగి' టీజర్ విడుదల
- 1960ల నాటి తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు గ్రామ కథ
- కమ్మరి గంగ అనే పవర్‌ఫుల్ పాత్రలో సరికొత్తగా శర్వానంద్
- రక్తపాతంతో కూడిన యాక్షన్, భావోద్వేగాలతో ఆకట్టుకుంటున్న టీజర్
- నవంబర్ 12న థియేటర్లలోకి రానున్న 'భోగి' చిత్రం




టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ తన పంథా మార్చి పూర్తిస్థాయి మాస్ యాక్షన్ అవతారంలోకి అడుగుపెట్టారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'భోగి' టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. దర్శకుడు సంపత్ నంది తనదైన శైలిలో రూపొందించిన ఈ టీజర్, సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. పచ్చి పల్లెటూరి నేపథ్యం, తీవ్రమైన యాక్షన్ సన్నివేశాలు, బలమైన భావోద్వేగాలతో టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. శర్వానంద్‌ను మునుపెన్నడూ చూడని రఫ్ లుక్‌లో చూపించడంతో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.ఈ సినిమా కథ 1960ల కాలంలో తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని ఒక గ్రామంలో జరుగుతుందని టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. ఆనాటి సమాజంలో పాతుకుపోయిన భూస్వామ్య వ్యవస్థ, అణచివేత, హింస వంటి అంశాలను కథలో ప్రధానంగా ప్రస్తావించినట్లు కనిపిస్తోంది. ఈ చిత్రంలో శర్వానంద్ 'కమ్మరి గంగ' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. వృత్తిరీత్యా కమ్మరి అయిన గంగ, తన గ్రామాన్ని గుప్పిట్లో పెట్టుకున్న పెత్తందారులకు ఎదురు తిరిగే సామాన్యుడి ప్రతినిధిగా నిలబడతాడు. టీజర్‌లో శర్వానంద్ చెప్పిన సంభాషణలు, ఆయన నటన పాత్రలోని తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి.గ్రామస్తుల కష్టాలు, వారిపై జరిగే దౌర్జన్యాలు, పోలీసులతో ఘర్షణలు, అణచివేతపై గంగ చేసే పోరాటం వంటి సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మట్టి వాసనను ప్రతిబింబించే దృశ్యాలు, రక్తపాతంతో నిండిన యాక్షన్ ఘట్టాలు ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో శర్వానంద్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, టీజర్‌లోని నేపథ్య సంగీతం సన్నివేశాలకు మరింత బలాన్నిచ్చింది.'భోగి' చిత్రాన్ని నవంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంతో శర్వానంద్ మాస్ హీరోగా మరో మెట్టు ఎక్కుతారని అభిమానులు ఆశిస్తున్నారు.

## 'మీరు చేసింది ప్రచారమే.. న్యాయం కాదు'.. జాన్వీ డీప్‌ఫేక్ వీడియోపై సెలబ్రెటీలకు ఆర్జీవీ చురకలు!



- జాన్వీ కపూర్ డీప్‌ఫేక్ వీడియోపై ఆర్జీవీ సంచలన వ్యాఖ్యలు
- సెలబ్రిటీల ట్వీట్లతోనే వీడియోకు భారీ ప్రచారం జరిగిందన్న వర్మ
- నిందితుడిని పట్టుకోకుండా ప్రచారం చేయడంపై తీవ్ర విమర్శలు
- బాధితురాలి పేరును బహిర్గతం చేయడం కూడా నేరమేనని స్పష్టీకరణ
- దోషిని పట్టుకున్నాకే విషయం బయటపెట్టాల్సిందన్న ఆర్జీవీ

సంచలన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో స్పందించారు. 'దేవర' సినిమాలోని 'చుట్టమల్లే' పాటకు సంబంధించి నటి జాన్వీ కపూర్ డీప్‌ఫేక్ వీడియోపై ఆయన చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ఈ వివాదంపై స్పందించిన సినీ ప్రముఖులు, దానికి అనవసర ప్రచారం కల్పించారని వర్మ తీవ్రంగా విమర్శించారు.ఈ అభ్యంతరకర వీడియోపై పలువురు సెలబ్రిటీలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడాన్ని ఆర్జీవీ తప్పుపట్టారు. వారి వరుస ట్వీట్ల వల్ల ఆ వీడియో గురించి తెలియని వారికి కూడా తెలిసిందని, ఫలితంగా కోట్లాది మంది దాని కోసం వెతికి చూసేలా చేశారని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది బాధితురాలికి సహాయపడటం కాదని, మరింత నష్టం కలిగించడమేనని అన్నారు."నిజంగా చేయాల్సింది వేరు. సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో ఆ నీచమైన పని చేసిన వ్యక్తిని పట్టుకోవాలి. వాడిని పట్టుకున్న తర్వాత ఆ విషయాన్ని ప్రచారం చేస్తే ఒక అర్థం ఉంటుంది. కానీ అలా చేయకుండా, బాధితురాలి పేరును హైలైట్ చేస్తూ పోస్టులు పెట్టారు" అని వర్మ విమర్శించారు.
బాధితురాలి గుర్తింపును ఇలా బహిరంగంగా ప్రచారం చేయడం కూడా చట్టపరంగా నేరమే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద సెలబ్రిటీల స్పందన న్యాయం చేయడం కంటే, ఆ అభ్యంతరకర కంటెంట్‌కు ఉచిత ప్రచారం కల్పించినట్లుగా ఉందని ఆర్జీవీ తన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662